సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్.చేతన్

గ్రామాలపై... ఫ్లోరైడ్...!

- ప్రజలకు శుద్ధనీరు కరువు
- ఫ్లోరైడ్ నీరే దిక్కు
- చిన్న వయసులోనే అనారోగ్య సమస్యలు
- ప్రభుత్వం, అధికారులు స్పందించకుంటే మరింత ప్రభావం

గ్రామీణులను ఫ్లోరైడ్ వెంటాడుతోంది. దాహం తీర్చుకునేందుకు తాగే నీరు గరళంగా మారి జనం ఆరోగ్యాన్ని విచ్ఛిన్నం చేస్తోంది. దేశంలో ఫ్లోరైడ్ నీరు అధికంగా ఉన్న జిల్లాలో సత్యసాయి జిల్లా ఒకటని ఇటీవల కేంద్ర ఆరోగ్య సంస్థ తెలియజేసింది. అందుకు అనుగుణంగానే జిల్లాలోని పలు గ్రామాల బోరుబావుల్లో వచ్చే నీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉన్నట్లు స్థానిక వైద్యులు కూడా నిర్ధారిస్తున్నారు. ఈ ఫ్లోరైడ్ నీరు విషంగా మారి జనం ఆరోగ్యాన్ని తినేస్తోంది. చిన్న వయసులోనే అనారోగ్యం పాలయ్యేలా చేస్తోంది.

ప్రజాశక్తి-కదిరి అర్బన్

గ్రామీణ ప్రాంతాలకు సురక్షిత మంచి నీరు అందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వివిధ పథకాలను ప్రవేశపెట్టారు. పేరుకు పథకాలున్నా ఆచరణలో అవి అమలవుతున్నది నామమాత్రమే. తీవ్ర వర్షాభావం, కరువుకు నిలయమైన కదిరి నియోజకవర్గంలోని గాండ్లపెంట, నంబులపూలకుంట, తలుపుల, తనకల్లు మండలాల్లో ఫ్లోరైడ్ ప్రభావం ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇటీవల సేకరించిన నీటి నమూనాల్లో ఫ్లోరైడ్‌తో పాటు ఇతర కాలుష్యలు ప్రమాదకర స్థాయిలో ఉన్నట్లు సంబంధిత అధికారులు గుర్తించారు. ప్రజలు తాగు నీటిని వినియోగించే బోరు బావుల్లో ఫ్లోరైడ్ శాతం గతంతో పోలిస్తే పెరిగినట్లు ఇందులో తేలింది.

శుద్ధ జల కేంద్రాలు మూత

2014లో అప్పటి ప్రభుత్వం గ్రామీణ ప్రాంత ప్రజలకు శుద్ధ నీటిని అందించేందుకు మినరల్ వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేసింది. రూ.2కు బిందె శుద్ధజలం అందించే ఏర్పాటు చేశారు. కొద్ది రోజులు ఇవి బాగానే జరిగిన తర్వాత ఈ కేంద్రాల నిర్వహణపై నీలినీడలు కమ్ముకున్నాయి. శుద్ధ జల కేంద్రాలు లేకపోవడంతో గ్రామీణులు తాగు నీటి కోసం బోరు బావులు, చేతిపంపులపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. మూతబడిన శుద్ధజల కేంద్రాలను అందు బాటులోకి తెచ్చేందుకు ఇప్పటికీ తీసుకుంటున్న నామమాత్రంగానే ఉన్నాయి. రోజురోజుకు విషతుల్యం అవుతున్న ఫ్లోరైడ్ నియంత్రణను చేసి అన్ని గ్రామాల్లో గ్రామాల్లో పూర్తి స్థాయిలో శుద్ధ జల కేంద్రాలు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామీణులు కోరుతున్నారు.

'కదిరి మండలం చిప్పలమడుగు గ్రామంలో గతంలో ఈ భవనంలో శుద్ధ జలం కేంద్రం ఉండగా ప్రస్తుతం అది మూతబడింది..!'

ఫ్లోరైడ్‌తో అనారోగ్యం

సాధారణంగా లీటరు నీటిలో 15 మిల్లీ గ్రాముల ఫ్లోరైడ్ ఉంటుంది. అది ఎక్కువ మోతాదులో శరీరం లోకి వెళ్తే చిన్న పిల్లల ఎదుగుదలపై తీవ్ర ప్రభావం చూపుతుంది. లీటరు నీటిలో ఫ్లోరైడ్ 1.50 మిల్లీ గ్రాములు దాటితే దంత క్షయం, 2మిల్లీ గ్రాములు దాటితే దంతాలపై పసుపు రంగు మచ్చలు, 5మిల్లీ గ్రాములు దాటితే ఎముకలు-మెత్తబడటం, 8మిల్లీ గ్రాములు దాటితే అవిటితనం, 20మిల్లీ గ్రాములు దాటితే థైరాయిడ్ గ్రంథిలో మార్పులు, 100 మిల్లీ గ్రాములు దాటితే నడుములు వంగిపోవడం, కాళ్లు చేతులు వంకర పోవడం, 125మిల్లీ గ్రాములు దాటితే మూత్రపిండాలు పని చేయకపోవడంతో లాంటి వ్యాధులు వస్తాయని వైద్యులు చెబుతున్నారు.



ఫ్లోరైడ్ నీటితో ప్రమాదం

డబ్ల్యూహెచ్ఒ నిబంధన ప్రకారం సాధారణంగా నీటిలో ఫ్లోరైడ్ 1.5మిల్లీ గ్రాములు ఉండాలి. అంతకంటే ఎక్కువ ఉంటే ఫ్లోరోసిస్ అనే వ్యాధి వస్తుంది. పళ్లు ఎముకలు, వెన్నుపూస తదితర అవయాలపై ప్రభావం చూపుతుంది. అనంతపురం, సత్యసాయి జిల్లాలోని పలు గ్రామాల్లో ఫ్లోరైడ్ శాతం ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ప్రజలకు శుద్ధ జలం అందించేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

డా॥మదన్ కుమార్
ఐఎంఎ సభ్యుడు, చిన్న పిల్లల వైద్యుడు కదిరి.

ప్రభుత్వానికి నివేదికలు పంపాం

ఫ్లోరైడ్ నియంత్రణలో భాగంగా గ్రామీణ ప్రాంత ప్రజలకు సురక్షిత శుద్ధ మంచి నీరు అందించాలనే ఉద్దేశంతో కదిరి ఎమ్మెల్యే కందికుంట వెంకట ప్రసాద్ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి నివేదికలు పంపాం. కదిరి నియోజకవర్గ వ్యాప్తంగా 6 మండలాలకు రూ.26.53 కోట్లతో 268 శుద్ధ జల కేంద్రాల ఏర్పాటు చేయాలని రాష్ట్ర ఉన్నతాధికారులకు లేఖ పంపాం. ఫ్లోరైడ్‌ను నియంత్రించేలా గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతాం.

వెంకటేశ్వర్లు,
ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ, కదిరి.

పరిశ్రమలతో ఆర్థిక ప్రగతి

కలెక్టర్ టిఎస్.చేతన్

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

జిల్లాలో పరిశ్రమల స్థాపన ద్వారానే ఆర్థిక ప్రగతి సాధ్యమని కలెక్టర్ టిఎస్.చేతన్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లో జిల్లా పరిశ్రమలు, ఎగుమతి ప్రోత్సాహక కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమల ఏర్పాటుకు సంబంధించి అవుత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రభుత్వ పరంగా చేయూతనివ్వాలని సూచించారు. నూతన పారిశ్రామిక విధానాన్ని ప్రభుత్వ నిబంధనల మేరకు అమలు చేయాలన్నారు. అర్హులైన ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఓసీలతో పాటు మహిళలకు ప్రభుత్వ మార్గదర్శకాలపై అవగాహన కల్పించి ఉత్పత్తి, సేవారంగం పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రోత్సహించాలని అధికారులను ఆదేశించారు. సూక్ష్మ, చిన్న, మధ్య పరిశ్రమల స్థాపనకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై అవగాహన కల్పించి చైతన్య పరచాలని సూచించారు. సింగిల్ డెస్క్ పోర్టల్ ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా 12 దరఖాస్తులకు సంబంధించి పెట్టుబడి, విద్యుత్ వడ్డీ రాయితీలకు రూ.40 లక్షలు మంజూరు చేస్తూ సమావేశంలో ఆమోదించారు. 14 పరిశ్రమల స్థాపనకు సంబంధించి జిల్లా కాలుష్య నియంత్రణ మండలితో పాటు ఫ్యాక్టరీ ఇన్స్పెక్టర్ ప్రత్యేక చొరవ చూపాలని ఆదేశించారు. జిల్లాలో 72 క్లైములు లక్ష్యం కాగా 16 అదనంగా రావడంపై సంతప్తిని వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పరిశ్రమల జనరల్ మేనేజర్ నాగరాజు, ఏపీసీ జోనల్ మేనేజర్ సోనీ సహాని, సాంఘిక సంక్షేమ శాఖ అధికారి శివరంగ ప్రసాద్, డిక్కీ జోనల్ అధ్యక్షుడు కోలా వెంకటరమణ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ వి.రత్న

పెండింగ్ కేసుల దర్యాప్తు వేగవంతం : ఎస్పీ

ప్రజాశక్తి-పుట్టపర్తి రూరల్

జిల్లా వ్యాప్తంగా పెండింగ్ కేసుల్లో దర్యాప్తును వేగవంతం చేయాలని ఎస్పీ వి.రత్న సూచిం చారు. పట్టణంలోని జిల్లా పోలీసు కార్యాలయం నుంచి బుధవారం ఎస్పీ జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా డీఎస్పీలు, సిఐలు, ఎస్ఐలతో ముఖ్యమైన కేసులు గ్రేవ్, నాన్ గ్రేవ్, ఎస్సీ, ఎస్టీ, పోక్సో, మర్డర్, చోరీలపై నెల వారీ నేర సమీక్ష సమావేశం నిర్వహించారు. ఇప్పటికే అరెస్ట్ చేసిన కేసుల్లో త్వరితగతిన ఛార్జ్ షీట్ దాఖలు చేసి, బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో అందిన అర్జీలపై విచారణ జరిపి బాధితులకు న్యాయం చేయాలన్నారు. ప్రతిరోజూ వాహనాల తనిఖీలు చేపట్టాలన్నారు. బోర్డర్ చెక్ పోస్టుల్లో ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా చూడాలన్నారు. గ్రామాలకు వెళ్లి పల్లెనిద్ర చేపట్టి ప్రజలకు అవగాహన కల్పించాలని, గొడవలు, నేరాలు జరగకుండా చూడాలన్నారు. పాఠశాలలు, కళాశాలలను సందర్శించి విద్యార్థులకు గంజాయి, డ్రగ్స్, సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. గ్యాంబ్లింగ్, మట్కాను అరికట్టాలన్నారు. రోడ్డు భద్రత మాసోత్సవాలు నిర్వహించి ప్రజలకు రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన కల్పించాలన్నారు. రాత్రివేళ గస్తీ విధుల్లో అప్రమత్తంగా తిరుగుతూ నేరాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో ఎస్‌బి సిఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, డిసిఆర్‌బి సిఐ శ్రీనివాసులు, సైబర్ సెల్ సిఐ తిమ్మారెడ్డి, ఎస్‌బి ఎస్ఐ ప్రదీప్‌కుమార్, ఐటి కోర్ ఇన్‌ఛార్జి సుదర్శన్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రి కేశవ్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత, పరిటాల శ్రీరామ్

జీడిపల్లి-పేరూరు కాలువలకు నిధులివ్వండి

మంత్రిని కోరిన ఎమ్మెల్యే సునీత, పరిటాల శ్రీరామ్

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్‌తో రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత, ధర్మవరం నియోజకవర్గ టీడీపీ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ భేటి అయ్యారు. బుధవారం నాడు అనంతపురంలోని పయ్యావుల నివాసానికి వెళ్లి పలు అంశాలపై చర్చించారు. జీవో 59 ప్రకారం జీడిపల్లి రిజర్వాయర్ నుంచి పేరూరు ప్రాజెక్ట్ వరకు 54కిలోమీటర్లు కాలువ తవ్వాల్సి ఉందన్నారు. గత ఐదేళ్లలో ఈ పనులు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదన్నారు. పెండింగ్ పనులు, 4 పంపు హౌస్‌ల నిర్మాణాలతో పాటు పుట్టకనుమ, సోమరవాండ్లపల్లి ప్రాజెక్టుల నిర్మాణ పనులు ప్రారంభించాలన్నారు. పేరూరు ప్రాజెక్ట్ కాలువ తవ్వకం కోసం చేసిన 266 ఎకరాల భూ సేకరణ పరిహారం బిల్లులు రూ.14కోట్లు సిఎఫ్ఎంఎస్‌లో అప్‌లోడ్ చేశారని ఈ నిధులు విడుదల చేయాలన్నారు. కాలువ భూ సేకరణ కోసం రూ.51 కోట్లు బడ్జెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేశారు. పేరూరు కాలువ పనులు చేపట్టడానికి రూ.200 కోట్ల బడ్జెట్ కేటాయించాలన్నారు. హంద్రీనీవాకు సంబంధించి రైతుల కోరిక మేరకు లైనింగ్ బదులు కాలువ వెడల్పు చేయాలన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో లైనింగ్ చేయాల్సి వస్తే కాలువ గట్లకు ఇరు వైపులా చేసి కింది భాగం వదిలేయాలన్నారు. నసనకోట ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాలలో బాలికల జూనియర్ కాలేజీ మంజూరుకు నిధులు ఇవ్వాలన్నారు. వీటిన్నింటిపై మంత్రి కేశవ్ సానుకూలంగా స్పందించారు. ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకుంటామని తెలియజేశారు.

ఘనంగా మారెమ్మ జాతర

ప్రత్యేక పూజలో పాల్గొన్న దీపికా

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండల పరిధిలోని తూముకుంటలో వెలసిన మారెమ్మ జాతర బుధవారం ఘనంగా జరిగింది. గ్రామ దేవతకు స్థానికులు ఉదయం నుంచి ప్రత్యేక పూజలు నిర్వహించారు. హిందూపురం అసెంబ్లీ నియోజకవర్గ వైకాపా సమన్వయకర్త దీపికా వేణు రెడ్డి దేవాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమాల్లో వైసిపి నాయకులు రాము, తిప్పేరుద్రయ్య, ధనుంజయ రెడ్డి, మహేష్ గౌడ్, దేవరాజు, రామాంజి, అయోగ్‌బాషా, బాలు, గిరి, శ్రీరాములు, శబరీష్ రెడ్డి, అయూబ్ బేగ్, ఆసిఫ్, సహారా బాను పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయంతో సుస్థిర లాభాలు

డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ మేనేజర్ రామ్మోహన్

ప్రజాశక్తి-గుడిబండ

సమీకృత వ్యవసాయం ద్వారా రైతులు సుస్థిర లాభాలు. పొందవచ్చని డిఆర్‌డిఎ ప్రాజెక్ట మేనేజర్ రామ్మోహన్ సూచించారు. మండలంలోని కరికెర గ్రామంలో బుధవారం సమీకృత వ్యవసా యంపై కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. డిఆర్‌డిఎ ప్రాజెక్ట్ మేనేజర్ రామ్మోహన్ మాట్లాడుతూ సమీకృత వ్యవసాయం ద్వారా ఓ రైతు కుటుంబానికి నెలకు రూ. 50 వేలు ఆదాయం వచ్చేలా చూడటమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కెనరా బ్యాంక్ మేనేజర్ మల్లయ్య మాట్లాడుతూ రైతు సంఘాలకు బ్యాంకు ద్వారా ఆర్థికసాయం అందిస్తామని, తద్వారా వ్యవసాయ అను బంధ యూనిట్లు ఏర్పాటు చేసుకొని ఆదాయం పెంచుకోవాలన్నారు. ఏవో వీర నరేష్ మాట్లాడుతూ రాగి పంటను ఎక్కువగా పండించి లాభాలు పొందాలన్నారు. ఏరియా కోఆర్డినేటర్ నాగరాజు మాట్లాడుతూ వ్యవసాయం చేయడం వల్ల వచ్చే లాభాలను తెలిపారు. సమావేశంలో జిల్లా ఎఫ్‌సిఒ ఎపిఎం రమణప్ప, ఎపిఎం తిప్పన్న, ఆర్‌వైఎస్ఎస్ రమేష్, టెక్నికల్ అసిస్టెంట్ తిరుమలగౌడ్, మండల సమాఖ్య లీడర్ కమలమ్మ, భాగ్యమ్మ, ఎఫ్‌పిఒ సిసి దేవరాజు, సిసి రామాంజనేయులు, ఎపి మాస్ అనిల్‌కుమార్, సిబ్బంది, రైతు సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డిఆర్‌డిఎ మేనేజర్ రామ్మోహన్

రసాభాసగా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

కౌన్సిలర్ల అభిప్రాయాలు తెలుసుకోకుండా బడ్జెట్ ప్రవేశపెట్టడంపై వాగ్వాదం

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో బుధవారం ఛైర్మన్ తుంగా ఓబుళపతి, కమిషనర్ ప్రహ్లాద ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సిల్ సమావేశం రసాభాసగా మారింది. 2025-26 సంవత్సరా నికి మున్సిపల్ అధికారులు బడ్జెట్‌ను ప్రవేశపెట్టారు. దీంతో కౌన్సిలర్లను అడగకుండా ఎలా బడ్జెట్ ప్రవేశపెడతారని టిడిపి, వైసిపి కౌన్సిలర్లు అధికారులతో వాగ్వివాదానికి దిగారు. పట్టణంలోని అన్ని వార్డుల్లో తాగునీరు, వీధిలైట్లు, డ్రెయినేజీ, రోడ్డు సమస్యలు నెలకొన్నాయని, అధికారులు వాటిని పరిష్కరించనప్పుడు మేము కౌన్సిలర్లుగా ఉండి ప్రయోజనం ఏంటని టిడిపి, వైసిపి కౌన్సిలర్లు మూకుమ్మడిగా నిలదీయడంతో గందరగోళం నెలకొంది. మా కాలనీలోనే సమస్యలు పరిష్కరించకపోతే వైస్ ఛైర్మన్‌గా నేనెందుకు అని 1వ వార్డు కౌన్సిలర్ తిప్పన్న మండిపడ్డారు. నిధులు ఉన్నా అభివృద్ధి పనులు చేయకపోవడం ఏంటని 7వ వార్డు కౌన్సిలర్ సాయి గీత ప్రశ్నించారు. అసలు మమ్మల్ని కౌన్సిలర్లుగా గుర్తిస్తున్నారా లేదా గుర్తిస్తే గణతంత్ర దినోత్సవ వేడుకలకు ఎందుకు ఆహ్వానించలేదని ప్రశ్నించారు. స్పందించిన మున్సిపల్ అధికారులు భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. అలాగే వార్డుల్లో సమస్యలు పరిష్కరించి, మౌలిక వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వడంతో కౌన్సిలర్లు శాంతించారు.

సమావేశంలో ఛైర్మన్, కమిషనర్‌లను ప్రశ్నిస్తున్న కౌన్సిలర్లు

సర్వత్రా విమర్శలు

పుట్టపర్తి అర్బన్ : పాత్రికేయులకు సమాచారం ఇవ్వకుండా మున్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించడం, సాయంత్రం కార్యాలయం నుంచి ఓ ప్రెస్ నోట్ విడుదల చేయడంపై సర్వత్రా విమర్శలు వినిపిస్తున్నాయి. దీనిపై కమిషనర్ స్పందిస్తూ మీకు సమాచారం ఇవ్వకపోవడం సిబ్బంది పొరపాటని, ఇకపై ఇలా జరగదని తెలిపారు.

శాస్త్రీయ కళలను ప్రోత్సహించాలి

నాట్యరత్న సంధ్యా మూర్తి

ప్రజాశక్తి-హిందూపురం

శాస్త్రీయ కళలను ప్రోత్సహించాలని పద్మశ్రీ కల్లూరు సుబ్బారావు అవార్డు గ్రహీత నాట్యరత్న సంధ్యామూర్తి తెలియజేశారు. బుధవారం స్థానిక మహర్షి వాల్మీకి కళ్యాణమండపంలో పట్టణంలోని శ్రీ సాయి నత్య కళానిలయం 25వ వార్షికోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ భారతదేశం విభిన్న సంస్కతి, సాంప్రదాయాలకు నిలయంగా ఉంటుందన్నారు. సంస్కతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని పేర్కొన్నారు. శాస్త్రీయ కళలను ప్రోత్సహించాలని సూచించారు. అనంతరం కళానిలయం విద్యార్థినులు ప్రదర్శించిన శాస్త్రీయ, జానపద నత్యాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో హోమియోపతి వైద్యులు నారాయణరావు, హరినాథ్ పాల్గొన్నారు.

నృత్యం చేస్తున్న కళాకారిణిలు

వ్యవసాయ పొలం నుంచి తాగునీరు తెచ్చుకుంటున్న ప్రజలు

వెంకటాపురం పంచాయతీలో తాగునీటి ఎద్దడి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని వెంకటాపురం పంచాయతీకి తాగునీరు అందించే బోరు మోటారు మరమ్మతు లకు గురైంది. దీంతో ఆ పంచాయతీకి చెందిన వీర ఓబన్నపల్లి, పాలినివాళ్లపల్లిలో 40 రోజులుగా తాగునీటి సమస్య తీవ్రమైంది. విధి లేని పరిస్థితుల్లో అష్టకష్టాలు పడుతూ సమీప వ్యవసాయ బోరు బావుల వద్దకు వెళ్లి తాగునీరు తెచ్చుకుంటున్నామని ఆయా గ్రామాల ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీకి సంబంధించిన బోరు మోటారు మరమ్మతు లకు గురైందని పంచాయతీ సెక్రటరీ శ్రీకాంత్, సర్పంచి శంకర్‌రెడ్డి, ఎంపిటిసి దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా ప్రయోజనం లేదని వాపోయారు. ఇకనైనా ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు స్పందించి బోరు మోటారు మరమ్మతులు చేపట్టి తాగునీరు సరఫరా చేయాలని ఆయా గ్రామాలు ప్రజలు కోరుతున్నారు.

డ్రెయినేజీ ముందు ప్లకార్డులతో నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

ప్రమాదకరంగా డ్రెయినేజీ

ప్లకార్డులతో సిపిఎం నిరసన

ప్రజాశక్తి-పెనుకొండ

పట్టణంలో అసంపూర్ణంగా వదిలేసిన డ్రెయినేజీ కాలువ ప్రమాదకరంగా మారిందని సిపిఎం నాయకులు హరి ఆందోళన వ్యక్తం చేశారు. పట్టణంలోని కొత్తపేటలో పనులు చేయకుండా అసంపూ ర్ణంగా వదిలేసిన డ్రెయినేజీ కాలువ వద్ద బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో ప్లకార్డులు చేతపట్టి నిరసన వ్యక్తం చేశారు. హరి మాట్లాడుతూ డ్రెయినేజీ కాలువనై పైకప్పు లేకపోవడంతో దుర్వాసన వెదజల్లుతోం దన్నారు. మురుగునీరు వల్ల దోమలు వృద్ధి చెంది ప్రజలు రోగాల బారిన పడుతున్నారన్నారు. మూగజీవాలు, ప్రజలు అందులో పడి గాయపడిన సంఘటనలు ఉన్నాయన్నారు. నగర పంచాయతీ అధికారులు వెంటనే స్పందించి సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు బాబావలి, మహబూబ్‌బాషా, నరసింహా, రాజురావు, ఆరిఫ్, సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, ముస్లిం ఐక్యవేదిక రియాజ్, ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ బడుల్లో మారనిబోర్డులు

నేటికీ దర్శనమిస్తున్న 'జగనన్న గోరుముద్ద'



ప్రజాశక్తి-నంబులపూలకుంట

గత వైసిపి సర్కార్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు అందించే మధ్యాహ్న భోజన పథకాన్ని 'జగనన్న గోరుముద్ద'గా మార్చి నిర్వహించిన విషయం తెలిసిందే. అయితే రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని మార్చేశారు. అయినా మండలంలోని కొన్ని పాఠశాలల్లో నేటికీ 'జగనన్న గోరుముద్ద'గానే మధ్యాహ్న భోజన పథకం బోర్డులు దర్శనమిస్తున్నాయి. గురికానివారిపల్లి, పెదరాంపల్లి, రంగనపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో నోటీసు బోర్డుల్లో 'జగనన్న గోరుముద్ద' బోర్డులు దర్శనమివ్వడం గమనార్హం. మండల విద్యాధికారి పట్టణ కేంద్రాలకే పరిమితం కావడం, పర్యవేక్షణ లోపం కారణంగానే ఉపాధ్యాయులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఇప్పటికే టిఎన్.కొత్తపల్లి, పాపన్నగారిపల్లి, నాగంవారిపల్లి, ఎల్లంపల్లి, ఎగువపల్లి గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు మూతపడ్డాయన్న ఆరోపణలు ఉన్నాయి. ఇకనైనా జిల్లా ఉన్నతాధికారులు చొరవ చూపి గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వ విద్యను మెరుగు పరిచేందుకు చర్యలు చేపట్టాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుచున్నారు.

అంగన్వాడీ పోస్టులు అర్హులకు దక్కేనా?

ప్రజాశక్తి-మడకశిర రూరల్

నియోజకవర్గంలో అంగన్వాడీ శాఖలో ఖాళీగా ఉన్న కార్యకర్త, ఆయా పోస్టులకు కనీస అర్హత కలిగిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. త్వరలోనే ఆయా పోస్టులకు అభ్యర్థులను నియమించనున్నారు. ఈక్రమంలో దరఖాస్తు దారులు అధికార పార్టీ నాయకుల చుట్టూ ప్రదక్షిణలు ప్రారంభించారు. నాయకులు కూడా ఎలాగైనా తమ మద్దతుదారులకే పోస్టులు దక్కించుకునేలా పావులు కదుపుతున్నట్లు తెలుస్తోంది. ఇదే జరిగితే అన్ని అర్హతలు ఉన్న వారికి మరోమారు అన్యాయం జరిగే అవకాశం అవకాశం ఉంది. గత ప్రభుత్వంలో కూడా రాజకీయ నాయకుల జోక్యంతో అర్హులకు అన్యాయం చేశారన్న విమర్శలు బలంగా ఉన్నాయి. ఈసారైనా ఐసిడిఎస్ అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు తలొగ్గకుండా అన్ని అర్హతలు ఉన్న అభ్యర్థులకు న్యాయం చేస్తారో లేదో వేచిచూడాలి.

అంగన్వాడీల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి-పెనుకొండ టౌన్

రాష్ట్రపతికి రాసిన లేఖలు చూపుతున్న అంగన్వాడీలు

పట్టణంలో బుధవారం అంగన్వాడీ వర్కర్స్ అర్బన్ సెక్టార్ మీటింగ్ నిర్వహించారు. సిఐటియు జిల్లా కార్యదర్శి రమేష్, బాబావలి మాట్లాడుతూ సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్‌కు వడ్డీతో సహా గ్రాట్యుటీ చెల్లించాలని, ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతనాలు అమలు చేయాలని, ఐసిడిఎస్‌కు నిధులు కేటాయించాలని కోరుతూ భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకి లేఖలు పంపించామని తెలిపారు. కార్యక్రమంలో అంగన్వాడీ వర్కర్స్ యూనియన్ ప్రాజెక్ట్ కార్యదర్శి భావమ్మ, కోశాధికారి మాబున్నీసా, సెక్టార్ లీడర్లు సావిత్రమ్మ, లక్ష్మీదేవి, వర్కర్లు పాల్గొన్నారు.

3న ఆకాశవాణిలో 'మాణిక్యం' కవితలు

ప్రజాశక్తి-కొత్తచెరువు

ఆకాశవాణిలో కవితలు వినిపిస్తున్న మాణిక్యం

బుక్కపట్నం బాలుర ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడి మాణిక్యం ఇసాక్ రాసిన కవితలు ఫిబ్రవరి 3వ తేదీ అనంతపురం ఆకాశవాణి కేంద్రంలో వినిపించనున్నారు. దీంతో మాణిక్యంను ఆ పాఠశాల హెచ్ఎం జగదీశ్వర్, ఉపాధ్యాయులు అభినందించారు. మాణిక్యం రాసిన ఆరు కవితలను ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 7.40 గంటలకు ఆకాశవాణి అనంతపురం కేంద్రం నుంచి ప్రసారం చేస్తారు.

బాధితురాలిని పరామర్శిస్తున్న సిఐటియు నాయకులు

ఆశా వర్కర్‌కు పరామర్శ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

మండలంలోని ముచ్చురామి గ్రామంలో మంగళవారం రాత్రి ఆశా వర్కర్ లక్ష్మీదేవిపై అదే గ్రామానికి చెందిన పెద్ద పక్కీరప్ప కట్టెతో దాడి చేసి గాయపరిచాడు. ఈ విషయం తెలియడంతో బుధవారం సిఐటియు మండల కన్వీనర్ జెవి.రమణ, నాయకులు ఎస్. హైదర్‌వలి ఆ గ్రామం వెళ్లి లక్ష్మీదేవిని పరామర్శించారు. వారు మాట్లాడుతూ లక్ష్మీదేవిపై దాడి చేసిన వారిని పోలీసులు వెంటనే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని, ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవా లని డిమాండ్ చేశారు.

రైతు సేవా కేంద్రంలో పేర్లు నమోదు చేసుకోండి

ప్రజాశక్తి-కొత్తచెరువు

మండలంలో కంది పంట సాగు చేసి, దిగుబడిని విక్రయించే రైతులు సంబంధిత రైతు సేవా కేంద్రంలో పేర్లు రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని ఏవో నటరాజు తెలిపారు. పంట సాగు చేసిన తర్వాత ఈక్రాప్ బుకింగ్ చేయించుకున్న రైతులు మాత్రమే అర్హులన్నారు. కందులను ఎపి మార్కెటింగ్ సంస్థ వారు కొనుగోలు చేస్తారన్నారు.

గుండెపోటుతో ఆశా కార్యకర్త మృతి

ప్రజాశక్తి-నల్లచెరువు

విధులు నిర్వహిస్తూ గుండెపోటుతో ఆశా కార్యకర్త మృతి చెందిన సంఘటన బుధవారం మండలంలోని తలమర్లవాండ్లపల్లి పంచాయతీ ఎర్రగుంటపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. సమీప బంధువులు తెలిపిన వివరాలు.. ఎర్రగుంటపల్లి గ్రామానికి చెందిన ఉమాదేవి(48) ఆశా కార్యకర్తగా పని చేస్తుంది. ఇంటింటి సర్వేలో భాగంగా విధులకు హాజరుకావాలని సూపర్వైజర్ సుధాకర్ ఫోన్ చేశారు. దీంతో ఆమె సర్వేలో పాల్గొంది. అనంతరం ఉన్నఫళంగా కుప్పకూలి కింద పడిపోయింది. దీంతో ఆమెను హుటాహుటిన ప్రభుత్వాసుపత్రికి తరలించగా వైద్యాధికారి కల్పనారెడ్డి ప్రథమ చికిత్స అందించినా ఫలితం లేకపోయింది. ఆమెకు ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా నెలలో ఒక మంగళవారం మాత్రమే మీటింగ్ పెట్టుకోవాల్సి ఉండగా నిబంధనలకు విరుద్ధంగా బుధవారం మీటింగ్ నిర్వహిం చడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

బిసి కులగణనపై 9న ర్యాలీ, ధర్నా

ప్రజాశక్తి-కదిరి టౌన్

బిసి కులగణనపై ఫిబ్రవరి 9వ తేదీ గుంటూరులో చేపట్టే భారీ ర్యాలీ, ధర్నా కార్యక్రమాలను జయప్రదం చేద్దామని బిసి ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సంపంగి గోవర్ధన్ పిలుపునిచ్చారు. పట్టణంలోని రోడ్లు భవనాలు అతిథి గృహంలో బుధవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ విద్య, ఉద్యోగ, ఆర్థిక, సామాజిక రంగాల్లో బిసిలకు 50 శాతం రిజర్వేషన్లు పొందాలంటే బిసి కుల గణన అవసరం అన్నారు. అందుకోసం ఎన్నో ఏళ్లుగా బిసి కులగనన, సమగ్ర జనగనణ చేయాలని పోరాటం చేస్తున్నా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు. కార్యక్రమంలో బిసి ప్రచార కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు బత్తల శ్రీనివాసులు, నాయకులు గంగాధర్, ఆంజనేయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న బిసి ప్రచార కమిటీ నాయకులు

ఎపిడబ్ల్యుజెఎఫ్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

సమావేశంలో పాల్గొన్న ఎపిడబ్ల్యుజెఎఫ్ నాయకులు, సభ్యులు

పట్టణంలోని ఎన్‌జిఒ హోం లో బుధవారం నిర్వహించిన ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్(ఎపిడబ్ల్యు జెఎఫ్) సమావేశంలో డివిజన్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ముఖ్యఅతిథిలుగా ఎపిడబ్ల్యుజెఎఫ్ ఉమ్మడి అనంతపురం జిల్లా ప్రధాన కార్యదర్శి రేపటి రామాంజనేయులు, ప్రజాశక్తి పాత్రికేయుడు శ్రీనివాసులు హాజరయ్యారు. ముందుగా ఇటీవల మృతిచెందిన సీనియర్ పాత్రికేయులు జెమినీ ప్రసాద్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాసేపు మౌనం పాటించారు. రేపటి రామాంజనేయులు మాట్లాడుతూ జర్నలిస్టుల హక్కులు, సమస్యలపై ఐక్యంగా ముందుకెళ్దామని పిలుపునిచ్చారు. ధర్మవరం డివిజన్ అధ్యక్షులుగా మురళీగౌడ్, గౌరవాధ్యక్షు లుగా శ్రీశైలం భాస్కర్‌గౌడ్, ఉపాధ్యక్షులుగా గడ్డపార నాగరాజు, రాజా, నాగార్జున, ప్రధాన కార్యదర్శిగా పతకమూరి నాగభూషణ, సహ కార్యదర్శులుగా సాయిప్రభు, రామాంజనేయులు, దేవేంద్రచౌదరి, అబ్దుల్లా, కోశాధికారిగా భీమినేని వెంకటేశ్వరచౌదరి, ప్రచార కార్యదర్శిగా జ్వాల ప్రసాద్‌రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా ఆంజనేయులు, మంజు, మల్లికారున, బాబయ్య, శివానాయక్, నరేశ్‌లను ఎన్నుకున్నారు. టౌన్ కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు.

'సేవ చేయడమే తెలుసు.. కబ్జా ఆరోపణలు అవాస్తవం'

షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ ప్రకటన

ప్రజాశక్తి -పెనుకొండ టౌన్

'సేవ చేయడం మాత్రమే తెలుసు.. కబ్జాలు చేయడం తెలీదు'.. కబ్జా ఆరోపణలు అవాస్తవం అని పేర్కొంటూ పట్టణంలోని షిరిడీ సాయి గ్లోబల్ ట్రస్ట్ బుధవారం ఓ ప్రకటన విడుదల చేసింది. వెంకటరెడ్డిపల్లి సమీపంలో 22 ఏళ్ల క్రితం భూములు కొనుగోలు చేసి ఎంతో మందికి ఉపాధి కల్పిస్తూ వ్యయసాయం చేస్తున్నా మన్నారు. ఎవరి భూములు కబ్జా చేయలేదని, చేయాల్సిన అవసరం కూడా ట్రస్ట్‌కు లేదని స్పష్టం చేశారు. 22 ఏళ్ల తర్వాత ఇద్దరు, ముగ్గురు వ్యక్తులు వచ్చి భూములు కబ్జా చేశామని చెప్పడం తగదన్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్య, వైద్యంతో పాటు కరువు ప్రాంతంలో అనేక సేవా కార్యక్రమా లు చేపట్టామన్నారు. బోర్లు వేయించి, వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేసి దాహార్తి తీర్చాం. వేలమంది విద్యార్థుల చదువులకు సాయం చేస్తున్నాం. నవ్యశ్రీ ఉచిత కంటి ఆసుపత్రి ద్వారా లక్షల మందికి కంటి పరీక్షలు, వేలమందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించామని, కళ్లఅద్దాలు పంపిణీ చేస్తున్నామ న్నారు. ఆ భూములకు సంబంధించిన వివరాలన్నీ రెవెన్యూ అధికారులకు ఇచ్చామన్నారు.

యుటిఎఫ్ మోడల్ పేపర్లు పంపిణీ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్



గొట్లూరులో మోడల్ పేపర్లు పంపిణీ చేస్తున్న యుటిఎఫ్ నాయకులు

మండలంలోని గొట్లూరు గ్రామ జడ్పీ హైస్కూల్‌లో బుధవారం 56 మంది పదో తరగతి విద్యార్థులకు యుటిఎఫ్ మోడల్ పేపర్లను ఉచితంగా పంపిణీ చేశారు. ముఖ్య అతిథులుగా ఎంఇఒ పి.రాజేశ్వరి, దాత తాడిమర్రి శ్రీనివాసులు, యుటిఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, హెచ్ఎం జగన్నాథం, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షులు బుక్కచెర్ల రామకృష్ణారెడ్డి, ఎస్ఎంసి ఛైర్మన్ శ్రీరాములు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ విద్యార్థులు ఈ మోడల్ పేపర్లను బాగా చదివి మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని సూచించారు. యుటిఎఫ్ ఉపాధ్యాయ సమస్యలపైనే ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల శ్రేయస్సు కోసం చిత్తశుద్ధితో పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు అమర్ నారాయణరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గిరిజన సంప్రదాయాలను పరిరక్షించాలి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

రాజమహేంద్రవరంలోని ఆదికవి నన్నయ్య విశ్వవిద్యాలయంలో ఫిబ్రవరి 5, 6 తేదీల్లో నిర్వహించే జాతీయ స్థాయి గిరిజన సాంస్కృతిక మహోత్సవాలను జయప్రదం చేయాలని ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) జిల్లా నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం టిఎస్ఎఫ్ ఆధ్వర్యంలో స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మహోత్సవాల గోడపత్రికను టిడిపి మండలం క్లస్టర్ ఇన్‌ఛార్జి మనోహర్‌నాయుడు ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు భారతీయ సంస్కృతిలో భాగంగా ఉన్నాయని, కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వాటిని పరిరక్షించే బాధ్యత తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో టిఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాజశేఖర్‌నాయక్, జాయింట్ సెక్రటరీ రఘునాథ్ నాయక్, ఉపాధ్యక్షులు మల్లేష్ నాయక్, రాష్ట్ర మహిళా విభాగం నాయకురాలు హేమలతబాయ్, మండల అధ్యక్షుడు కుళ్లాయప్పనాయక్ పాల్గొన్నారు.

భూ రీసర్వే పరిశీలన

ప్రజాశక్తి-గాండ్లపెంట

మండలంలోని సోమయాజులపల్లి పంచాయతీలోని బొలుగుట్లవారిపల్లిలో చేపట్టిన భూ రీ సర్వేను బుధవారం కదిరి ఆర్డీవో విఎస్ శర్మ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ఇకపై రైతులకు ఎలాంటి భూ సమస్య లేకుండా పకడ్బందీగా సర్వే చేసి భూమి హద్దులు, కొలతలు వేసి చూపాలని సర్వేయర్లను ఆదేశించారు. ఇంకా ఏమైనా సమస్యలు ఉంటే రైతులు నా దృష్టికి తెస్తే వెంటనే పరిష్కరి స్తామని తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సర్వేయర్లు వేమప్రసాద్‌రెడ్డి, కవిత, సుధాకర్‌నాయక్, రైతులు పాల్గొన్నారు.

బియ్యం పక్కదారి పడితే చర్యలు

ప్రజాశక్తి-నంబులపూలకుంట

పేదలకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రభుత్వం అందించే రేషన్ బియ్యం పక్కదారి పడితే కఠిన చర్యలు తప్పవని తహశీల్దార్ దేవేంద్రనాయక్, సిఎస్‌డిటి వాణిబాయి హెచ్చరించారు. స్థానిక ఎంపీడీవో కార్యాలయ సమావేశ మందిరంలో బుధవారం రేషన్ డీలర్లతో సమావేశం నిర్వహిం చారు. తహశీల్దార్ మాట్లాడుతూ కార్డుదారులకు బియ్యం, కంది బేడలు, తదితర నిత్యావసర వస్తు వులు సకాలంలో సక్రమంగా అందించాలని, బ్లాక్ మార్కెట్‌కు తరలిస్తే డీలర్‌షిప్ లైసెన్స్ రద్దు చేస్తా మని హెచ్చరించారు. సమావేశంలో డీలర్ల సంఘం అధ్యక్షుడు లక్ష్మీనారాయణరెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, సిద్దారెడ్డి, ప్రభాకర్, తదితరులు పాల్గొన్నారు.

సబ్సిడీ రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ప్రజాశక్తి-బుక్కపట్నం

స్వయం ఉపాధి సబ్సిడీ రుణాల కోసం ఫిబ్రవరి 7వ తేదీ లోపు గ్రామ సచివాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపిడిఒ శ్రీనివాసులు తెలిపారు. బీసీ, ఈబీసీ, ఆర్యవైశ్య, కాపు, కమ్మ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగ యువతీ, యువతు లకు సబ్సిడీ రుణాలు ఇస్తారన్నారు.

గాండ్లపెంట : సబ్సిడీ రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో వెంకట రామిరెడ్డి తెలిపారు. బిసి, ఈబిసి, కమ్మ, కాపు, బలిజ నిరుద్యోగ యువతీ, కువకుటు ఫిబ్రవరి 7వ తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా చేసుకోవాలని దరఖాస్తు చేసుకోవాలన్నారు.

మృతుని కుటుంబానికి ఆర్థికసాయం

ప్రజాశక్తి-రొద్దం

మండలంలోని దొడగట్ట గ్రామానికి చెందిన టిడిపి కార్యకర్త బేల్దారి వడ్డి రామాంజనప్ప బుధవారం మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మంత్రి సవిత భర్త, టిడిపి సీనియర్ నాయకులు వెంకటేశ్వరరావు ఆ గ్రామం వెళ్లి మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ. 10వేలు అందజేశారు. ఆయన వెంట మండల కన్వీనర్ నరహరి, నాయకులు మాధవనాయుడు, వెంకట రమణారెడ్డి, చిన్నమంతూరు పవన్, ఆర్. కొట్టాల శ్రీనాథ్‌చౌదరి, రామచంద్ర, పురుషోత్తం ఉన్నారు.

ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేశ్వరరావు

అవమానానికి గురైన మహిళ ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-పెనుకొండ

ఓ మహిళ ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం మండలంలోని మునిమడుగు గ్రామంలో చోటుచేసుకుంది. కియా పోలీస్‌స్టేషన్ ఎస్ఐ రాజేష్ తెలిపిన వివరాలు.. మునిమడుగుకు చెందిన వెంకటలక్ష్మి ఓ ప్రేమజంటకు సహకరించిందనే నెపంతో 15 రోజుల క్రితం ఆమె జుట్టు కత్తిరించిన విషయం విదితమే. ఈ సంఘటనకు సంబంధించి అప్పట్లో 20 మందిపై కేసు నమోదు చేసి 11 మందిని రిమాండ్‌కు తరలించారు. మిగిలిన వారిని అరెస్టు చేయలేదని, తనకు న్యాయం జరగలేదని మనస్థాపం చెంది ఆమె ఇంట్లో ఉన్న తలకు వేసుకునే హెయిర్ డై తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు పెనుకొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురం ఆ తర్వాత బెంగళూరుకు తరలించారు.

ధర్మవరంను అభివృద్ధి చేసుకుందాం:ఎంపిడిఒ

ప్రజాశక్తి-ధర్మవరం రూరల్

'మన ధర్మవరం-మనందరి ధర్మవరం' నినాదంతో మండలాన్ని అభివృద్ధి చేసుకుందామని ఎంపిడిఒ సాయిమనోహర్ పిలుపునిచ్చారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో బుధవారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఎంపిడిఒ మాట్లాడుతూ వేసవిలో గ్రామాల్లో తాగునీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులు, పంచాయతీ కార్యదర్శులుకు సూచించారు. రైతులకి పంటలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. సమావేశంలో రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు, ఎపిఒ అనిల్‌కుమార్, సచివాలయ, పోలీస్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమానాస్పద వ్యక్తుల సమచారమివ్వండి

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలో ఎక్కడైనా అనుమానాస్పదంగా కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. మండలంలోని సుందరయ్య కాలనీలో బుధవారం గ్రామసభ ఏర్పాటు చేశారు. ఎస్ఐ మాట్లాడుతూ చోరీలు, చైన్ స్నాచింగ్, అటెన్షన్ డైవర్షన్ వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఊరి బయట ఉండే ఇళ్లు, షాపుల్లో ఉండేవారికి జాగ్రత్తలను సూచించారు. షాపుల యజమానులు సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు.

పింఛన్ల పరిశీలనలో పాల్గొన్న వైద్యులు, అధికారులు

పింఛన్ల పరిశీలన

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని చిల్లలకొండయ్యపల్లి, పెద్దకోట్ల గ్రామాల్లో బుధవారం డాక్టర్ నరసింహారెడ్డి, డాక్టర్ చైతన్య ఆధ్వర్యంలో రూ. 15 వేలు పింఛను పొందుతున్న లబ్ధిదారుల ఇంటికి వెళ్లి సర్టిఫికెట్లను పరిశీలించారు. వైద్య బృందం సభ్యులు మాట్లాడుతూ పింఛనుదారుల ఆరోగ్య పరిస్థితి, సర్టిఫికెట్ల పరిశీలన చేపట్టామని, ఈ నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. వారి వెంట ఎంపీడీవో వెంకట రంగారావు, పిహెచ్‌సి డాక్టర్ హరిత, బిజెపి నాయకులు నాగార్జున, ఆనంద్, అధికారులు ఉన్నారు.

వీవోఏల ఆందోళనలు వాయిదా

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

రాష్ట్ర ప్రభుత్వం చర్చలకు పిలిచిన నేపథ్యంలో రెండు రోజులుగా కలెక్టరేట్ వద్ద చేపట్టిన సామూహిక నిరాహార దీక్ష, ఆందోళన కార్యక్రమాలను రాష్ట్ర కమిటీ పిలుపుమేరకు వాయిదా వేస్తున్నట్లు బుధవారం సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఈఎస్ వెంకటేష్ ఓ ప్రకటనలో తెలిపారు. ఫిబ్రవరి 4న రాష్ట్ర కమిటీతో ప్రభుత్వ అధికారులు చర్చిస్తారన్నారు. అందులో న్యాయమైన వీవోఏల డిమాండ్లను ఆమోదిస్తే సంతోషకరమన్నారు. ఒకవేళ చర్చలు విఫలమైతే రాష్ట్ర సిఐటియు కమిటీ నిర్ణయం మేరకు తదుపరి ఆందోళనలకు సిద్ధమవుతామన్నారు. అందుకు వీవోఏలు సిద్ధంగా ఉండాలన్నారు.

ప్రశ్నపత్రాలను ప్రభుత్వమే పాఠశాలలకు చేర్చాలి

ప్రజాశక్తి-పుట్టపర్తి క్రైమ్

ప్రశ్నపత్రాలను ప్రభుత్వమే పాఠశాలలకు చేర్చాలని యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు జయచంద్రరెడ్డి, ప్రధాన కార్యదర్శి సుధాకర్ బుధశారం ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. 1-5 తరగతుల ప్రశ్నపత్రాల కోసం క్లస్టర్ కేంద్రానికి, 6, 7, 8 తరగతుల ప్రశ్నపత్రాల కోసం ఎంఆర్‌సి కేంద్రానికి ఉపాధ్యాయులు రోజూ ఉదయం, మధ్యాహ్నం వెళ్లాలని అధికారులు ఆదేశించారని ఇది ఎలా సాధ్యమని ప్రశ్నించారు. కొన్ని పాఠశాలలు మండల కేంద్రానికి 20 కిలోమీటర్లు దూరంలో ఉన్నాయని, వారు రోజూ రెండుసార్లు ప్రశ్నపత్రాలను తీసుకెళ్లడం కష్టమన్నారు. కావున ప్రభుత్వం పునరాలోచించి సముచిత నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. వారిలో యుటిఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షులు భూతన్న, ఉపాధ్యక్షులు జిహెచ్.బాబు, నాయకులు సీతాలక్ష్మీ, శ్రీనివాసులు, శివశంకర్, లక్ష్మీనారాయణ, వైవి.సుబ్బారెడ్డి, లతాదేవి ఉన్నారు.

పొలం పిలుస్తోంది

ప్రజాశక్తి-తాడిమర్రి

మండలంలోని నార్పింపల్లి, తాడిమర్రి గ్రామాల్లో బుధవారం మండల ఏవో రమాదేవి ఆధ్వర్యంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. మొక్కజొన్న పంటను సందర్శించి సమగ్ర సస్యరక్షణ చర్యలను రైతులకు వివరించారు. కత్తెర పురుగు, తెగుళ్లకు నివారణ మందులు, సస్యరక్షణ చర్యలను తెలిపారు. ఖరీఫ్-2024 సీజన్‌లో కంది సాగు చేసి పంట నమోదు చేయించుకున్న రైతుల నుంచి క్వింటా రూ. 7,550తో ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ముందుగా సంబంధిత రైతు సేవా కేంద్రంలో రిజిస్ట్రేషన్ చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం సిబ్బంది ఓబుళమ్మ, నార్పింపల్లి రైతులు పాల్గొన్నారు.

కొండకమర్ల హైస్కూల్ తనిఖీ

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

ఉపాధ్యాయులు విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం కృషి చేయాలని డిఇఒ క్రిష్టప్ప సూచించారు. డిఇఒ బుధవారం మండలంలోని కొండకమర్ల జడ్పీ హైస్కూల్‌ను తనిఖీ చేశారు. ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన పదో తరగతి విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించి ఉత్తీర్ణత శాతం పెరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం విద్యార్థులతో ముచ్చటిం చారు. మధ్యాహ్నం భోజనాన్ని పరిశీలించి విధిగా మెనూ పాటించాలని ఆదేశించారు. ఆయన వెంట ఎంఇఒ సురేష్‌బాబు, హెచ్ఎం భాస్కర్ ఉన్నారు.

కొండకమర్ల పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న డిఇఒ కృష్ణప్ప

నేరాలు ఘోరాలు

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి-బత్తలపల్లి

కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన బుధవారం మండలంలోని సూర్యచంద్రపురం గ్రామంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. సూర్యచంద్రపురం గ్రామానికి చెందిన గుజ్జల ఈశ్వరయ్య కుమారుడు గుజ్జల శంకర్(37) ధర్మవరం పట్టణంలోని సత్యసాయి నగర్‌లో నివాసం ఉండేవాడు. బాధ్యత లేకుండా జులాయిగా తిరుగుతూ, చాలా మంది వద్ద అప్పులు చేశాడు. అప్పుడప్పుడు గ్రామానికి వచ్చి వెళ్లేవాడు. భార్య కష్టపడి సంపాదించి అతడు చేసిన చాలా అప్పులు చెల్లించింది. ఈ క్రమంలో కుటుంబ కలహాలు, అనారోగ్య సమస్యలతో బుధవారం స్వగ్రామం వచ్చిన శంకర్ వారి బంధువైన గుజ్జల గంగాధర ఇంట్లో ఉరి వేసుకున్నాడు. అతడికి భార్య జ్యోతి, ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

బెంగళూరులో రోడ్డు ప్రమాదం.. మహిళ మృతి

ప్రజాశక్తి-రొద్దం


మౌనిక(ఫైల్‌ఫోటో)

బెంగళూరులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలం లోని గౌరాజుపల్లి గ్రామానికి చెందిన మౌనిక(22) మృతి చెందింది. వివరాలు.. మౌనిక బెంగళూరులో ఓ ప్రయివేట్ కంపెనీలో పని చేస్తుంది. విధులకు వెళ్లేందుకు ఉదయం బస్టాప్‌లో బస్సు కోసం వేచి ఉంది. ఇంతలో ఓ బస్సు వచ్చి అక్కడ ఆగింది. దీంతో ఆమె ఈ బస్సును దాటుకుని ఆమె ఎక్కాల్సిన బస్సు ఎక్కేందుకు పరిగెడుతూ వెళ్లి బస్సు ఎక్కే క్రమంలో ప్రమాదవశాత్తూ వెనుక భాగంలో టైర్ల కింద పడి అక్కడికక్కడే మృతి చెందింది.

చిరుధాన్యాల పంట అగ్నికి ఆహుతి

ప్రజాశక్తి-ముదిగుబ్బ

ముదిగుబ్బ గ్రామానికి చెందిన రైతు మౌలాలి తన 3 ఎకరాల పొలంలో చిరుధాన్యాలు (సామలు, అరికెలు) సాగుచేశాడు. ఆయా పంటలు చేతికి వచ్చే సమయంలో గుర్తుతెలియని వ్యక్తులు చెత్తకు నిప్పుపెట్టగా ఆ మంటలు ఇతని పొలంలోకి వ్యాపించి అగ్నికి ఆహుతయ్యాయని రైతు ఆవేదన వ్యక్తం చేశాడు. బాధిత రైతు మాట్లాడుతూ వాతావరణ మార్పులు, నీటి ఎద్దడి, అధిక వర్షాలను తట్టుకుని తక్కువ సమయంలో అధిక పోషక విలువలు కలిగిన దిగుబడి వచ్చే కొత్త వంగడాల(సామలు, అరికెలు)ను ఏడేళ్ల నుంచి కష్టపడి తయారు చేశానన్నారు. తీరా పంట చేతికొచ్చే సమయంలో కళ్లముందే మొత్తం పంట అగ్నికి ఆహుతైందని వాపోయాడు. మళ్లీ కొత్త రకం వంగడాలు సృష్టించ డానికి ఏడేళ్లు పడుతుందని ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు. విషయం తెలిసి న వెంటనే టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జి తుమ్మల మనోహర్ పొలానికి వెళ్లి పంట నష్టాన్ని పరిశీలించి రైతు మౌలాలిని అడిగి వివరాలు తెలుసుకున్నారు. అలాగే చుట్టుపక్కల పొలాల్లో అగ్నికి ఆహుతైన కంది పంట, మామిడి తోటలను పరిశీ లించారు. పంట నష్టాన్ని అధికారులతో పాటు నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు.

విద్యుదాఘాతంలో బేల్దారికి గాయాలు

రొద్దం : మండలంలోని బూచెర్ల గ్రామానికి చెందిన బోయ ఆంజనేయులు బుధవారం విద్యుత్ షాక్‌కు గురై తీవ్రంగా గాయపడ్డాడు. ఆంజనేయులు ఉదయం మండలంలోని ఎల్‌జిబినగర్‌లో పని చేసేందుకు వెళ్లాడు. గోడకు ప్లాస్టింగ్ చేస్తుండగా పక్కనే ఉన్న విద్యుత్ తీగలు మెడకు తాకడంతో తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు అతడిని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలిం చారు. ప్రథమచికిత్స తర్వాత అనంతపురం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే అతని పరిస్థితి విషమంగా ఉన్నట్లు గ్రామస్తులు తెలిపారు.

పేకాట జూదరులు అరెస్టు

రొద్దం : మండలంలోని కోగిర గ్రామ సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై దాడి చేసి ఇద్దరు జూదరులను అరెస్టు చేసి రూ. 30 వేలు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ నరేంద్ర తెలిపారు. ఎస్ఐ మాట్లాడుతూ అందిన సమాచారం మేరకు పోలీసులతో కలిసి బుధవారం పేకాట స్థావరంపై దాడులు చేశామన్నారు. మొత్తం 11 మందిలో ఇద్దరు పట్టుబడ్డారని మిగిలిన 9 మంది తప్పించుకున్నారని తెలిపారు. వారి నుంచి రూ. 30వేలు స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించామని తెలిపారు.

మిస్సింగ్ కేసు నమోదు

కదిరి టౌన్ : పట్టణంలోని కందికుంట నారాయణమ్మ కాలనీలో నివాసం ఉం టున్న టేకు సత్యనారాయణ కనపడకుండా పోవడంతో మిస్సింగ్ కేసు నమోదు చేసినట్లు సిఐ నారాయణరెడ్డి తెలిపారు. సత్యనారాయణ స్థానిక అనంతపురం రోడ్డులోని ఆంజనేయస్వామి ఆలయం వద్ద పానీపూరి బండి పెట్టుకొని జీవనం సాగించేవాడు. గత మంగళవారం ఉదయం కూరగాయల తెచ్చేందుకు మార్కెట్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటి నుంచి వెళ్లాడు. ఎంత సేపటికీ తిరిగి ఇంటికి రాకపోయేసరికి కుటుంబ సభ్యులు ఫోన్ చేయగా స్విచ్ఛాఫ్ వచ్చింది. దీంతో అతని భార్య, బంధువులు కదిరితో పాటు చుట్టుపక్కల ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో అతని భార్య టేకు హేమావతి ఫిర్యాదు మేరకు పట్టణ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసినట్లు సిఐ తెలిపారు.

గౌనిపల్లిలో పేరుకుపోయిన చెత్త

ప్రజాశక్తి-ఓబుళదేవరచెరువు

మండలంలోని గౌనిపల్లి గ్రామం అంబేద్కర్ కాలనీలో కొన్ని నెలలుగా చెత్త చెదారం పేరుకుపోయింది. అందులో నుంచి దుర్వాసన వెదజల్లడం, దోమలు వృద్ధి చెందడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారు. ఈ విషయాన్ని పంచాయతీ సెక్రటరీ మల్లికార్జున దృష్టికి తీసుకెళ్లినా రేపు, మాపు అంటూ కాలయాపన చేస్తున్నారే తప్ప చెత్తను తరలించడం లేదని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా పంచాయతీ అధికారులు స్పందించి చెత్తను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

ప్రాణం తీసిన భూ వ్యవహారం

గుండెపోటుతో గిరిజనుడు మృతి

ప్రజాశక్తి-తనకల్లు

శ్రీనివాసులు నాయక్ (ఫైల్‌ఫోటో)

భూ వ్యవహారం ఓ గిరిజనుడి ప్రాణం తీసింది. తాను కొన్న భూమి తనకు దక్కదేమో అన్న ఆందోళనతో గుండెపోటుతో మరణించాడు. ఈ ఘటన బుధవారం తనకల్లు మండల కేంద్రంలో చోటు చేసుకుంది. ఇందుకు సంబంధించి బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి..

తనకల్లు సమీపంలో జాతీయ రహదారి పక్కనే సర్వే నెంబర్ 837-ఎ 7.92 ఎకరాలు భూమిని 2016లో మండలంలోని గేమే నాయక్ తండాలో నివసించే మూడే సుశీల భర్త రమణానాయక్ తనకల్లు మండల కేంద్రానికి చెందిన తనకంటి కష్ణమూర్తి, భార్య ఈశ్వరమ్మ, కుమారుడు తనకంటి మధుబాబులు నుంచి కొనుగోలు చేశాడు. భూమి కొన్నాగానీ దానిని చూపిం చడంలో అమ్మిన వారు కాలయాపన చేస్తూ వచ్చారు. ఇటీవల అదే సర్వే నెంబర్‌పై 2020లో మధుబాబు, తమ్ముడు శ్రీధర్ ఆ భూమిని పులివెందులకు చెందిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారులకు అమ్మేశారు. ఈ విషయం తెలుసుకున్న సుశీలమ్మ, రమణనాయక్ అన్న శ్రీనివాసులునాయక్(55) మూడు రోజుల ముందు వారికి సంబంధించిన భూమి వద్దకు వచ్చి చూశారు. ఆ భూమిలో ప్లాట్లు వేసి ఉండడాన్ని చూసి శ్రీనివాసులు నాయక్ ఆందోళనకు గురయ్యారు. అప్పటికే అనారోగ్యంతో ఉన్న శ్రీనివాసులు నాయక్ తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. దీంతో కుటుంబ సభ్యులు ఆయన్ను తనకల్లు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స కోసం కదిరి ప్రభుత్వా సుపత్రికి తీసుకువెళ్లగా గుండెపోటుతో మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. శ్రీనివాసులు నాయక్ కుమారుడు శ్రీకాంత్ నాయక్ మాట్లాడుతూ గొర్రెలు మేపుకుని జీవనం సాగించే తమ భూమిని అక్రమంగా లాక్కుని మోసం చేశారన్నారు. గతంలో రిజిస్ట్రేషన్ అయిన స్థలాన్ని మళ్లీ రెండవ సారి రిజిస్ట్రేషన్ చేశారన్నారు. అధికారుల నిర్లక్ష్యంతో తన తండ్రి మరణించాడని కన్నీటి పర్యంతమయ్యాడు. దీనిపై అధికారులు విచారణ తమ భూమి తమకు ఇప్పించాలని, తన తండ్రి మరణాకి కారమైన వారిని శిక్షించాలని కోరారు. కాగా బాధితుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గోపి తెలిపారు.